# ప్రజాస్వరం

PRAJASWARAM తెలుగు దినపత్రిక

**Bullet Edition**

సోమవారం 25 మార్చి 2025 | www.prajaaswaramdaily.com | 2 pm


## ఎస్ఎల్‌బీసీ సొరంగంలో మరో మృతదేహం వెలికితీత

మ హబూబ్ నగర్: నాగర్ కర్నూల్ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. తాజాగా మరో మృతదేహాన్ని గుర్తించి అధికారులు వెలికితీశారు. అనంతరం నాగర్‌కర్నూల్ ప్రభుత్వాస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. ఈ ఘటనలో మొత్తం 8 మంది కార్మికుల గల్లంతు కాగా ఇటీవల ఒకరి మృతదేహం లభ్యమైంది. మరో ఆరుగురి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.



## 4 వారాల్లో షెడ్యూల్ చేయాలి

### సుప్రీం కోర్టు ఆదేశం

### ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ విచారణ

ఢిల్లీ : 'ఫిర్యాదులపై ఏం చేస్తారో.. 4 వారాల్లో షెడ్యూల్ చేయాలని కోర్టు ఆదేశించింది. అయినా పార్టీ మారిన వారికి స్పీకర్ నోటీసులు ఇవ్వలేదు. ధర్మాసనం కొన్ని వ్యాఖ్యలు చేసిన తర్వాతే నోటీసు ఇచ్చారు. 3 వారాల్లో రిప్లై ఇవ్వాలని, ఫిబ్రవరి 13న స్పీకర్ నోటీసులు ఇచ్చారు. ఇప్పటికి 3 వారాలైంది. నోటీసులు ఎటు వెళ్లాయో తెలియదు. మేము ఫిర్యాదు చేసి ఏడాదైనా స్పీకర్ షెడ్యూల్ కూడా చేయలేదు' అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది సుందరం తెలిపారు. ఈక్రమంలో స్పందించిన జడ్జి జస్టిస్ గవాయ్ పార్టీ ఫిరాయింపులకు వార్షికోత్సవం అయిందా అని వ్యాఖ్యానించారు.



పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. సుందరం వాదనలు వినిపించారు. ముగ్గురు ఎమ్మెల్యేలపై వేర్వేరుగా ఫిర్యాదు చేసినా స్పీకర్ స్పందించలేదన్నారు. నోటీసు కూడా ఇవ్వలేదని చెప్పారు. ఒక ఎమ్మెల్యే కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓడారని ఆ తర్వాత కూడా బీఆర్ఎస్ లోనే ఉన్నామంటున్నారని చెప్పారు. ఇలాంటి వ్యవహారాల్లో రాజ్యాంగ ధర్మాసనాల తీర్పులు ఉన్నాయని పేర్కొంది. ఎప్పటిలోగా తేల్చాలనే విషయంలో గత తీర్పులు స్పష్టంగా చెప్పలేదని పేర్కొంది. అలాంటప్పుడు ఆ తీర్పును కాదని ఎలా ముందుకు వెళ్లగలమని చెప్పింది. ఉన్నత ధర్మాసనాల తీర్పులను ఎలా తిరిగి రాయగలమని ప్రశ్నించింది. పిటిషనర్ల వాదనలు ముగియడంతో విచారణను సుప్రీంకోర్టు విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

## 3న కొత్త మంత్రుల ప్రమాణం?

### మంత్రివర్గంలో ఇద్దరు బీసీలు, రెడ్డి, ఎస్సీకి చోటు

హైదరాబాద్: తెలంగాణ కేబినెట్ విస్తరణకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) పచ్చజెండా ఊపింది. ఏప్రిల్ 3న కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారం ఉండే అవకాశం ఉంది. ఇద్దరు బీసీలు, రెడ్డి, ఎస్సీకి మంత్రివర్గంలో చోటు దక్కనున్నట్లు సమాచారం. ఈ మేరకు రాష్ట్ర కోర్ కమిటీ నుంచి ఏఐసీసీ వివరాలు తీసుకుంది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నుంచి అభిప్రాయాలు సేకరించింది.

**వీరికి చాన్స్?**

సుదర్శన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డిలో ఒకరికి చోటు దక్కే అవకాశం ఉంది. బీసీలో శ్రీహరి ముదిరాజ్, ఆది శ్రీనివాస్‌కు.. ఎస్సీలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి చోటు దక్కే అవకాశం ఉంది. మొత్తం ఆరు ఖాళీల్లో నాలుగైదు స్థానాలు భర్తీ చేసే అవకాశం ఉంది. మైనారిటీలకు అవకాశమిస్తే ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్‌కు చోటు దక్కే అవకాశం ఉంది.



## హోంమంత్రి పదవి ఇష్టం

### ఏ పదవి ఇచ్చినా సమర్థవంతంగా నిర్వహిస్తా
### కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

హైదరాబాద్ : మంత్రి పదవి వస్తదనే అనుకుంటున్నా... కెపాసిటీని బట్టి మంత్రులను ఎంపిక చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. తాజాగా ఆయన విలేకరులతో మాట్లాడారు. భువనగిరి ఎంపీ బాధ్యతలు ఇస్తే.. సమర్థవంతంగా నిర్వహించానని గుర్తు చేశారు. తనకు హోంమంత్రి పదవి అంటే ఇష్టమన్నారు. ఏ పదవి వచ్చినా సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ప్రజల పక్షాన నిలబడతానని స్పష్టం చేశారు.. నిన్న ఢిల్లీలో సీరియస్ గానే కేబినెట్ పై చర్చ జరిగినట్లు ఉందన్నారు.

తెలంగాణ క్యాబినెట్ విస్తరణకు ముహూర్తం దాదాపుగా ఖరారు అయింది. ఉగాది నాటికి విస్తరణ పూర్తి చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. గత ఏడాదిన్నరగా విస్తరణకు సంబంధించి అనేక ఊహాగానాలు వినిపించినప్పటికీ తాజాగా అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. క్యాబినేట్ విస్తరణతో పాటు ఇతర పదవులు... నామినేటెడ్ పోస్టుల నిర్ణయం తీసుకోనున్నారు. సోమవారం ముఖ్యమంత్రి ఢిల్లీలో పార్టీ అగ్రనేతలతో భేటీ అయ్యారు. సీఎంతో పాటు డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నారు. వీరంతా రాహుల్ గాంధీ, ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో నాలుగు మంత్రి పదవులు ఎవరికి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారో తెలియాల్సి ఉంది.



## మద్యం మత్తులో కారుతో ఢీ...
## యువతికి తీవ్రగాయాలు

హైదరాబాద్: మద్యం మత్తులో ఓ వ్యక్తి వాహనంతో యువతిని ఢీకొట్టి అనంతరం పారిపోయిన ఘటన బాలానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఐడీపీఎల్ చౌరస్తాలో ఓ వ్యక్తి కారులో అతి వేగంగా వస్తూ యువతిని ఢీకొట్టాడు. అనంతరం వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. వెంటనే ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తమై.. ఫతేనగర్ సిగ్నల్ వద్ద వాహనాన్ని ఆపి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడిని బల్కంపేటకు చెందిన గొగం అనిల్(35)గా గుర్తించారు. యువతికి తీవ్రగాయాలు కావడంతో సమీప ఆస్పత్రికి తరలించారు. సోమవారం రాత్రి మొయినాబాద్‌లోని ఓ ఫామ్‌హౌస్‌లో విందుకు హాజరై ఉదయం తిరిగి వస్తున్న క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. నిందితుడు అనిల్ మద్యం మత్తులో ఉన్నట్లుగా పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.






## కోనోకార్పస్ తొలగింపుపై దృష్టి

### ఆక్సిజన్ ఉత్పత్తికి ముప్పు

### వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో హరితహారం కార్యక్రమంపై ఆసక్తికరమైన చర్చ చోటు చేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో 200 కోట్ల మొక్కలు నాటామని, దీంతో రాష్ట్రంలోని అటవీ కవచం 7 శాతం పెరిగిందని వివరించారు. దీనిపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ స్పందిస్తూ, హరితహారం పేరుతో నాటిన మొక్కల్లో ఆరోగ్యానికి హానికరమైన కోనోకార్పస్ చెట్లు పెద్ద సంఖ్యలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఈ చెట్లు ఆక్సిజన్ ఉత్పత్తికి ముప్పుగా మారుతాయని, పైగా అవి పక్షులకు కూడా సహజ వాతావరణాన్ని అందించలేవని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఈ చెట్లు కొద్ది మాత్రమే నాటినట్లు సమర్థించగా, స్పీకర్ పెద్ద ఎత్తున నాటినట్లు స్పష్టం చేశారు. హైవేలు, డివైడర్లు సహా అనేక ప్రాంతాల్లో ఇవి కనిపిస్తున్నాయని, కాబట్టి వీటిని వెంటనే తొలగించే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.



## భట్టిని కలిసిన మాజీ మంత్రులు

హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని ఘట్‌కేసర్ ఫ్లైఓవర్ పనులు పునఃప్రారంభించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, మల్లారెడ్డి కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ పనులు గత కొన్ని నెలలుగా ఆగిపోయిన నేపథ్యంలో ప్రజలకు ఎదురవుతున్న అసౌకర్యాన్ని వివరించారు. రోజూ ట్రాఫిక్ జాంలతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని, అందువల్ల పనులను వేగంగా పూర్తిచేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డిప్యూటీ సీఎం వెంటనే అవసరమైన నిధులను మంజూరు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదే సందర్భంలో 50 లక్షల రూపాయలు మంజూరు చేయడంపై మల్లారెడ్డి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. దీనికి సంబంధించి అధికారులతో చర్చించిన భట్టి విక్రమార్క, పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు.